568) పూర్వగౌళ / గౌళిపంతు

ప॥ ఇద్దరూ నెదిరించిరి ఇన్నిటికి మూలము। పొద్దు వొద్దుకు మనము బుద్ధి చెప్పనేటికే॥

చ॥ సెలవి నవ్విన నవ్వు సిగ్గులకు మూలము। కలికి తనము కాకల మూలము।
పలుకులు లోలోనె పై కొనుటకు మూలము। వెలసె నన్ని పనులు వేగిరించనేటికే॥

చ॥ కొనగోరి చెనకులు కోరికలకు మూలము। పెనగులాటలు కడు బ్రియమూలము।
తనివోని కొసరులు తమకముల మూలము। యెనసె దనంతదానె యెచ్చరించ నేటికే॥

చ॥ మొగమొగాలు చూచుట మొక్కులకు మూలము। తగవులు కూటమికి దానెమూలము।
నిగిడి శ్రీవేంకటాద్రి నిలయుడు సతినేలె। పగటున నిక వేరే బాసడుగ నేటికే॥